క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన


విద్యార్థినిని అభినందిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని అర్బన్: స్టేట్ ఫస్ట్, థర్డ్ ర్యాంక్‌లు సాధించిన స్థానిక అక్షరశ్రీ కళాశాల విద్యార్థులు ఉమ్మిసిఫా(990/1000), షాన్వాజ్(464/470)లను ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అభినందించారు. శుక్రవారం ఎమ్మెల్యే స్వగృహంలో విద్యార్థులకు ఎమ్మెల్యే స్వీటు తినిపించి అభినందించారు. రాష్ట్రస్థాయి ర్యాంక్‌లు సాధించడం ఆదోని పట్టణానికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కళాశాల నిర్వాహకులు సుధాకర్‌రెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేదింటి విద్యాకుసుమం


నాడుగేని రాజు

కోసిగి: మండల కేంద్రంలోని రంగప్ప గట్టు వద్ద నివాసం ఉంటున్న నాడుగేని నాగరాజు, నాగమ్మ దంపతుల కుమారుడు రాజు ఇంటర్మీడియెట్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో 464/470 మార్కులు సాధించాడు. తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం గుంటూరుకు వలస వెళ్లడంతో మేనమామ వద్ద ఉంటూ ఏపీ మోడల్‌లో స్కూల్‌లోనే పదో తరగతి చదివి 519 మార్కులతో పాసయ్యాడు. 2022-2023 ఆర్థిక సంవత్సరంలో ఆర్డీటీ సెట్‌కు ఎంపిక కావడంతో విజయవాడ శ్రీచైతన్య ఐఐటీ అకాడమిక్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇంటర్మీడియెట్ ఎంపీసీ గ్రూపులో చేరాడు. ఆర్డీటీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి చదివి 464 మార్కులు సాధించి కాలేజీ ఫస్ట్‌గా నిలిచాడు. విద్యార్థిని ఆర్డీటీ మండల ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్య అభిందించారు. ఆర్డీటీ సాయం మారువలేనిదని, ఐఐటీలో సీటు సాధించి అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తానని విద్యార్థి రాజు తెలిపారు.

ప్రభుత్వ బాలికల కళాశాల సత్తా

ఆదోని అర్బన్: ఇంటర్ మీడియెట్ ఫలితాల్లో పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాల సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ సంజన్న తెలిపారు. ఎంపీసీలో రాధిక 931/1000, సీఈసీలో దేవేంద్రమ్మ 895/1000 మార్కులు సాధించారన్నారు. జూనియర్ బైపీసీలో ఇంటర్‌లో తస్లీమా 386/440, సీఈసీలో అఫ్రీన్‌భాను 435/500, ఎంపీసీలో ఇందు 404/470 మార్కులు సాధించారన్నారు. సీనియర్ ఇంటర్ 55 శాతం, జూనియర్ ఇంటర్‌లో 40 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.

రేపు మన్‌కీ బాత్

ఆదోని అర్బన్: దేశ ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 30న 100వ ఎపిసోడ్ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని జేపీ రాష్ట్ర కార్యదర్శి కునిగిరి నీలకంఠ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులకు మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ దేశంలో ఉన్న చారిత్రాత్మక కట్టడాలు, వనరులు, ఆయా రంగాల్లో విశేషంగా కృషి చేసిన మహానుభావుల గురించి సంప్రదాయ విషయాలు, ఆధ్యాత్మిక విషయాలపై మనతో పంచుకుంటారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి కొండపల్లి బొమ్మల గురించి దేశంలో జరుపుకుంటున్న అమృత్ మహోత్సవాల గురించి, జీ-20 సమావేశాల గురించి అనేక చారిత్రాత్మక ఆలయాల గురించి ప్రస్తావిస్తారన్నారు. ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని వీక్షించాలని కోరారు.

గుండెపోటుతో వైస్ ఎంపీపీ మృతి


పరమేష్‌గౌడ్ (ఫైల్)

పెద్దకడబూరు: మండల పరిధిలోని నౌలేకల్లు గ్రామానికి చెందిన పరమేష్ గౌడ్(47) వైస్ ఎంపీపీ గుండెపోటుతో శుక్రవారం మృతిచెందారు. ఆయన కుటుంబంతో పాటు ఎమ్మిగనూరులో నివసిస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి చెస్టు భాగంలో నొప్పి రావడంతో భార్యతో కలిసి ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి అడ్మిట్ అయ్యాడు. తెల్లవారుజామున నొప్పి తగ్గడంతో భార్యను ఇంటికి పంపించి ఇద్దరు స్నేహితులను పిలిపించుకున్నాడు. వారితో మాట్లాడుతూ ఆకలవుతుందని ఇడ్లి తీసుకు రమ్మని చెప్పడంతో స్నేహితులు బయటకు వెళ్లి తెచ్చేలోపే విగతజీవిగా మారాడు. అక్కడున్న వైద్య సిబ్బంది పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించడంతో విషయాన్ని భార్య, కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ఆదోని రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హాళగుందకు చెందిన బోయ ధణాపురం హనుమంతు(36) కోలుకోలేక శుక్రవారం మృతిచెందాడు. ఇస్వీ పోలీసులు తెలిపిన వివరాలు.. హనుమంతు ఈనెల 18న బైక్‌పై ఆదోనికి బయలుదేరాడు. ఇటుకల బట్టీ వద్ద బైక్‌పై నుంచి కింద పడ్డాడు. స్థానికులు ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించగా.. మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు రెఫర్ చేశారు. కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. మృతుడి భార్య పవిత్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ బషీర్‌అహ్మద్ తెలిపారు.

జలగండం.. జరభద్రం

- ఈతకు వెళ్తూ మృత్యువాత పడుతున్న విద్యార్థులు, యువకులు
- పెద్దల సమక్షంలోనే ఈత నేర్చుకోవాలి
- పాడుబడిన బావులు, చెరువుల్లో ఈత ప్రమాదం

వేసవికాలంలో నీటిని చూస్తే చిన్నారులతో పాటు పెద్దలకూ ఎక్కడ లేని ఆనందం. సరదాగా ఈత కొట్టాలని ప్రతిఒక్కరూ ఉవ్విళ్లూరుతారు. దీనికి తోడు ఇదే నెలలో విద్యాసంస్థలకు వేసవి సెలవులు ప్రకటిస్తుండటంతో విద్యార్థులు, యువకులు స్నేహితులతో కలిసి బావులు, చెరువులు, కుంటలకు వెళ్లి సరదాగా ఈత కొడుతుంటారు. ఈ క్రమంలో కొందరు ఈత రాకపోయినా అత్యుత్సాహం, అవగాహనా రాహిత్యంతో నీటిలోకి దిగి మృత్యువాత పడుతున్న ఘటనలూ ఏటా చూస్తూనే ఉన్నాం. ఇకపైనైనా అలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్దల సమక్షంలో ఈత నేర్చుకోవడంతో పాటు పాడుబడిన బావులు, చెరువుల్లో ఈత కొట్టకపోవడమే మేలు. – ఆదోని అర్బన్

☛ ఈనెల 17న స్థానిక హనుమాన్‌నగర్‌లోని ఎరుకల కాలనీకి చెందిన యువకుడు నాగరాజు పట్టణంలోని చౌదరిబావికి సరదాగా ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. ఇంటర్‌తో చదువు ఆపేసిన ఆ యువకుడు బ్యాండు వాయించుకుంటూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు.

☛ గతేడాది ఆగస్టులో నిజాముద్దీన్ కాలనీకి చెందిన మహ్మద్‌గౌస్ చౌదరిబావిలో ఈత కోసం వెళ్లాడు. ఈత రాక మునిగి మృత్యువాత పడ్డాడు. యువకుడి మృతి తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చింది.


ఇటీవల ఈతకు వెళ్లి మృత్యువాత పడిన ఎరుకల నాగరాజు (ఫైల్)



ఎల్లెల్సీలో ఈత కొడుతున్న యువకులు, ఆదోనిలోని చౌదరిబావిలో గల్లంతైన యువడి కోసం గాలిస్తున్న అగ్నిమాపక కేంద్రం సిబ్బంది(ఫైల్)

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ..

☛ మనిషి మునగని లోతు ఉన్న నీటిలో తల్లిదండ్రుల పర్యవేక్షణలో ఈత నేర్చుకోవాలి.
☛ స్విమ్మింగ్‌పూల్‌లో అయితే గైడ్ సమక్షంలో నేర్చుకోవాలి.
☛ స్నేహితులతో పోటీ పడి ఈత కొట్టరాదు.
☛ పాడుబడ్డ బావి, చెరువుల్లో ఈత కొట్టడానికి వెళ్లరాదు.
☛ అందులో పూడిక, నాచు కాళ్లకు చుట్టుకొని మునిగిపోయే ప్రమాదం ఉంది.
☛ ఎల్లెల్సీ, హెచ్‌ఎల్‌సీల్లో నీటి పారుదల వేగం ఎక్కువగా ఉంటుంది కనుక ఈత కొట్టరాదు.
☛ బావులు, చెరువుల గట్లపై నుంచి నీటిలోకి దూకరాదు.

నియోజకవర్గంలో మృత్యువాత పడిన వివరాలు

☛ 2019 ఏప్రిల్ నుంచి 2020 మార్చి మధ్య ఒకరు మృత్యువాత పడ్డారు.
☛ 2020-21 సంవత్సరంలో 10 ఘటనలు చోటుచేసుకోగా ఐదుగురు మృత్యువాత పడ్డారు.
☛ 2021-22 సంవత్సరంలో ఆరు ఘటనల్లో ఏడుగురు మృతిచెందారు.
☛ 2022-23లో మూడు ఘటనల్లో ఇద్దరు చనిపోయారు.

బావి, చెరువుల్లో ఈత శ్రేయస్కరం కాదు



పాడుబడ్డ బావి, చెరువులో ఈత కొట్టేందుకు వెళ్లరాదు. అందులో పాచు, మొక్కల వేర్లు, పూడిక ఉంటాయి. అవి కాళ్లకు చుట్టుకొని ఈత కొట్టేందుకు అవకాశం ఉండదు. దీంతో మునిగిపోయి మృత్యువాత పడే పరిస్థితి ఉంటుంది. సరదాగా ఈత కొట్టేందుకు స్విమ్మింగ్‌పూల్‌కు వెళ్లాలి. గైడ్ సమక్షంలోనే ఈత నేర్చుకోవాలి.

– శ్రీరామ్, త్రీటౌన్ సీఐ

చైన్నై-ముంబయి రైలుకు అంతరాయం


రైలు ఇంజిన్‌కు అడ్డుగా వచ్చిన చెట్టు కొమ్మలు

కోసిగి: చెట్టు కొమ్మలు అడ్డు రావడంతో చెన్నై- ముంబయి రైలుకు అంతరాయం ఏర్పడింది. ఈదురు గాలులకు కోసిగి- కుప్పగల్ రైల్వే స్టేషన్ మధ్య గవిగట్టు రైల్వే గేటు సమీపంలో మధ్యాహ్నం 3.30 గంటలకు కోసిగి మీదుగా చెన్నై నుంచి ముంబయి వెళ్లే 22158 ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజిన్‌కు చెట్టు కొమ్మలు అడ్డు పడ్డాయి. రైల్వే పైలెట్‌కు దారి కనింపిచక పోవడంతో రైలును ఆపేసి సిబ్బందికి సమాచారం ఇచ్చారు. రైల్వే గ్యాంగ్ సిబ్బంది అక్కడకు చేరుకుని చెట్టుకొమ్మలను తొలగించడంతో రైలు బయలుదేరింది. ఈఘటనలో దాదాపు గంట ఆలస్యంగా వెళ్లింది.

కొనసాగుతున్న దీక్షలు


మద్దతు తెలుపుతున్న వాల్మీకి సంఘం నాయకులు

ఆదోని రూరల్: తమ కుల వృత్తిని వేరే కులం వారు చేపట్టరాదనే డిమాండ్‌తో నాయీబ్రాహ్మణులు చేపట్టిన నిరసన దీక్ష శుక్రవారానికి మూడో రోజుకు చేరుకుంది. వారికి వాల్మీకి సంఘం నాయకులు, జనార్దన్, రమేష్, శివ, ధను, వినోద్ మద్దతు తెలిపారు.

త్వరలో వైద్యవిభాగం కమిటీలు


మంత్రి జయరాంను కలిసిన డాక్టర్ కృష్ణమూర్తి

ఆదోని అర్బన్: వైఎస్సార్‌సీపీ వైద్య విభాగంలో ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా త్వరలో కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. శుక్రారం ఆయన ఆలూరులో రాష్ట్ర కారిమ్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాంను కలిశారు. పార్టీ అధిష్టానం ఆదేశం మేరకు అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో కలిసి వైద్యవిభాగ కమిటీలను ఏర్పాటు చేసి వారి ద్వారా ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించాలని కోరారు. కమిటీలు, వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తే తాము వైద్య సాయం చేస్తామని విన్నవించగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

సచివాలయం సేవలు మెరుగుపడాలి

- సబ్‌కలెక్టర్ అభిషేక్ కుమార్


21వ వార్డులో పర్యటిస్తున్న సబ్‌కలెక్టర్ అభిషేక్ కుమార్

ఆదోని టౌన్: సచివాలయాల సేవలు మరింత మెరుగుపడాలని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం 21వ వార్డు సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. పెండింగ్ సమస్యలను కమిషనర్ లేదా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారం చేస్తామన్నారు.విధుల పట్ల ఎవరూ నిర్లక్ష్యం వహించవద్దన్నారు.కాసేపు స్థానికులతో మాట్లాడారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా అని ఆరా తీశారు. ఈయన వెంట మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, వార్డు కౌన్సిలర్ ఎస్‌పీ అక్మీదేవి పాల్గొన్నారు.

మేడే పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్‌లను విడుదల చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ఆదోని రూరల్: మేడే ఉత్సవాల వాల్‌పోస్టర్లను శుక్రవారం ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకప్ప, సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా అధికార ప్రతినిధి మల్లికార్జున తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేసి, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని విమర్శించారు. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికవర్గం ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ, ఏపీ ప్రగతిశీల భవన కార్మిక సంఘం నాయకులు వలమన్న, ఈరన్న, తిక్కస్వామి, బి.ఈరన్న, రాముడు, ఐఎఫ్‌టీయూ నాయకులు రవి, పెందన్న, వీరేశలింగం, వెంకటేష్, శివమ్మ, మణి, శిరీష, కిషోర్ పాల్గొన్నారు.

తుంగభద్ర నదిపై వరద కాలువ నిర్మించండి


మాట్లాడుతున్న మల్లయ్య

కౌతాళం: తుంగభద్ర నదిపై మేళిగనూరు వద్ద వరద కాలువ నిర్మించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య కోరారు. రైతు సంఘం మండల కమిటీ సమావేశాన్ని శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఎరువుల ధరలు, కల్తీ ఎరువులు, కల్తీ విత్తనాలు పెరిగిపోయాయన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు. సమావేశంలో మండల కార్యదర్శి ఈరన్న, నాయకులు హనుమంతు, వన్నూరప్ప, రామాంజనేయులు, నాగరాజు, చూడి ఈరన్న పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోని టౌన్: పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ బోయ శాంత అధ్యక్షతన మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. సభ్యులు అనేక సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. కుళాయిలు వదిలిన సమయంలోనే విద్యుత్ సరఫరా ఆగిపోతుండటంతో ప్రజలు నీరు పట్టుకోలేక పోతున్నారని, ఇంటింటికి వచ్చి చెత్తను సేకరిస్తున్నప్పుడు ప్రధాన రోడ్లు, కూడళ్లలో డస్ట్‌బిన్లు ఎందుకని, తొట్టెలు ఉండడంతో ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్నాయని, రాంజల రోడ్డులో చర్చి వద్ద నుంచి దుబ్బ గణపతి వరకు నిర్మించ తలపెట్టిన కాలువను మధ్యలోనే ఆపేయడంతో మురుగు నీరు అక్కడికక్కడే నిలిచి ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతుందని, రోడ్లలో పైపులైన్ల లీకేజీ, కొత్త పైపులైన్ల లీకేజీకి తవ్విన గుంతలను వెంటనే పూడ్చాలని సభ్యులు బాలాజీ, రఘునాథ్‌రెడ్డి, పార్వతి సభకు విన్నవించారు. ఆయా సమస్యలపై స్పందించిన కమిషనర్ వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, రెవెన్యూ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సిగ్గు లేకుండా లోకేశ్ సెల్ఫీలు

- మామను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబే పెద్ద విషనాగు
- దమ్ముంటే మంత్రాలయం నుంచి పోటీచెయ్యి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి సవాలు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి

మంత్రాలయం: పోకేష్‌గా పేరుగాంచిన లోకేశ్ సిగ్గు లేకుండా ప్రాజెక్టుల వద్ద సెల్ఫీలు దిగుతున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి దుయ్యబట్టారు. శుక్రవారం మండల పరిధిలోని చిలకలడోణ గ్రామంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ హయాంలో ప్రాజెక్టులకు పైసా ఖర్చు చేయకపోయినా తామే కట్టినట్లు నిస్సిగ్గుగా సెల్ఫీలు తీసుకోవడం విడ్డూరమన్నారు. పులికనుమ ప్రాజెక్టు సృష్టికర్త, నిర్మాణ శిల్పి దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి అని అందరికీ తెలుసన్నారు. రూ.261 కోట్లతో రాజశేఖర్‌రెడ్డి ఈ ప్రాజెక్టు పూర్తి చేశారన్నారు. కేవలం రూ.5 కోట్లు వెచ్చించి అటవీశాఖ అనుమతులు మాత్రమే చంద్రబాబు హయాంలో తీసుకొచ్చారన్నారు. ఇవేమీ తెలియని లోకేశ్ ప్రాజెక్టు తామే కట్టించామని ప్రకటించుకోవడం దుర్మార్గమన్నారు. ఎన్నికల సమయంలో ఆర్డీఎస్ కుడిగట్టు కాలువకు సర్వే అంటూ హడావుడి చేసినా... సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిధులు ఇచ్చిన తర్వాతే పనులు చేట్టారన్నారు. ప్రస్తుతం కాలువ హెడ్ లెగ్యురేటర్ పనులు, రిజర్వాయర్ల భూసేకరణ సాగుతోందన్నారు. సారా, ఇసుక వ్యాపారం చేసిన చరిత్ర టీడీపీ ఇన్‌చార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డిదేనన్నారు. రాగిమాన్‌దొడ్డి, కంబదహాల్ నుంచి ఎర్రమట్టి తరలిస్తున్నట్లు నిరూపించే సత్తా లోకేశ్‌కు ఉందా అని ప్రశ్నించారు. చిన్నతుంబళం చెరువులో బెస్త సంఘం ఆధ్వర్యంలోనే చేపలు పెంచుకుంటున్నారని, పులికనుమ ప్రాజెక్టులో మండగిరి వాసి టెండర్ ప్రకారం చేపలు పెంచారని తెలిపారు. ఉరకుంద ఈరన్న స్వామి ఆలయం, మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠాన్ని చంద్రబాబే అభివృద్ధి చేశాడని చెప్పుకోవడం లోకేశ్ తెలివి తక్కువకు నిదర్శనమన్నారు.

చంద్రబాబే పెద్ద విషనాగు..

ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి విషనాగని వర్ణించడం లోకేశ్‌కు తగదన్నారు. రాజకీయ భవిష్యత్తు కోసం సొంత మామనే వెన్నుపోటు పొడిచిన పెద్ద విషనాగు చంద్రబాబు అనే సంగతి అందరికీ తెలుసన్నారు. తమ ప్రభుత్వంపై, స్థానిక ఎమ్మెల్యేలపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. దమ్ము ధైర్యం ఉంటే బాలనాగిరెడ్డిపై పోటీ చేసి గెలవాలని లోకేశ్‌కు సవాలు విసిరారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల కన్వీనర్లు భీమిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ప్రహ్లాద్ ఆచార్, ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, నియోజవర్గ నాయకులు ఐరన్‌గల్లు శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి, రవిచంద్రారెడ్డి, సర్పంచులు తెల్లబండ్ల భీమయ్య, పాల్ దినకర్ పాల్గొన్నారు.

ప్రచారభేరీ సభను జయప్రదం చేయండి

ఆదోని రూరల్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 30న రిక్రేషన్ క్లబ్ ఆవరణలో జరిగే ప్రచారభేరీ సభను జయప్రదం చేయా లని సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు బసాపురం గోపాల్, లింగన్న కోరారు. శుక్రవారం స్థానిక సుందరయ్యభవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు అందరం కలిసి ముందడుగు వేయాలన్నారు. ప్రచార భేరీ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రామచంద్రయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, అజయ్‌బాబు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాధాక్రిష్ణ, వెంకటేశులు తదితరులు పాల్గొంటారన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు గోపాల్, సీపీఎం నాయకులు అంజిత్‌గౌడ్, రమేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


మృతుడి భార్యకు సాయం అందజేస్తున్న నాయకులు

ఆదోని టౌన్: పట్టణంలోని 19వ వార్డు మండిగిరి ఏరియాలో నివాసముంటున్న రాము అలియాస్ రామన్నగౌడ్(34) గుండెపోటుతో శుక్రవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు టెలిఫోన్ చంద్ర, మొండి మల్లయ్య, అంజి, కన్వీనర్లు వెంకటేశులు, వీరేష్, గృహసారథి దుర్గేష్, నాయకులు దివాకర్, వెంకటేష్, నాగేంద్ర, మధు చేతులమీదుగా దహన సంస్కారాలకు గానూ రూ.10 వేలు మృతుడి భార్యకు అందించారు.

పంచాయతీ కార్యాలయం తనిఖీ

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని డీఎల్‌పీఓ నూర్జహాన్ శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, ఇంటి పన్ను వసూలుపై ఈఓ నాగరాజును ఆరా తీశారు. పన్ను వసూలుపై దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు.

ప్రజా శ్రేయస్సుకు నవరత్నాలు


పథకాలపై మహిళను ఆరా తీస్తున్న వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి

మంత్రాలయం: ప్రజా శ్రేయస్సుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు ఎంతగానో దోహదపడుతున్నాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంత్రాలయం మండలం చిలకలడోణ గ్రామంలో ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై లబ్ధిదారులను ఆరా తీశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమిరెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటరెడ్డి, ఎంపీడీవో ప్రభావతి, వ్యవసాయాధికారి గణేష్, ఏఈవో నరసింహుడు, ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు, పంచాయతీ కార్యదర్శి ఇష్రాత్ బాషా పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి


మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యవైద్యాధికారి రామగిడ్డయ్య

ఆదోని రూరల్: జిల్లా పశ్చిమ ప్రాంతంలో బాల్య వివాహాలను అరికట్టాలని జిల్లా వైద్యాధికారి రామగిడ్డయ్య అన్నారు. గ్రామ సచివాలయాల పరిధిలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. శుక్రవారం ఆదోని పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని సిల్వర్‌జూబ్లీ హాల్ ఆవరణలో ఆదోని డివిజన్‌లోని ఏఎన్‌ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. గర్భిణులను ప్రసవానికి ముందే ఆస్పత్రిలో చేర్పించాలన్నారు. కిశోర బాలికలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించాలన్నారు. 0-5 సంవత్సరాల్లోపు పిల్లలు అంగన్‌వాడీ సెంటర్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలకు సూచనలు ఇవ్వాలన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఫ్యామిలీ ఫిజిషియన్ విధానం మన రాష్ట్రంలోనే ప్రారంభమైందని, జిల్లాలో 108 అంబులెన్స్ వాహనాలు 40 ఉన్నాయని, ప్రతినెలా రెండుసార్లు చొప్పున ప్రతి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ పర్యటించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి, జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర డాక్టర్ ప్రవీణ్, డీపీఎంఓ డాక్టర్ ఉమ, ఆర్‌బీఎస్‌కే జిల్లా కో ఆర్డినేటర్ హేమలత, ఫ్యామిలీ ఫిజిషియన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ బాలమురళీ, డీపీఓ విజయరాజు, ఎస్‌ఓ హేమసుందరం, డెమో శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్‌లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పిడుగు పడి ఎద్దు మృతి



కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం పిడుగు పడటంతో ఎద్దు మృతి చెందింది. స్థానికుల తెలిపిన వివరాలు.. రైతు అళ్లయ్య తన రెండు ఎద్దులను పొలానికి తీసుకెళ్లాడు. మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన వాన కురవడంతో ఎద్దుల్ని ఇంటికి తీసుకు వచ్చి వాముదొడ్డిలో కట్టేశాడు. కాసేపటికే పిడుగు పడటంతో ఒక ఎద్దు మృతిచెందింది. దాదాపు రూ.50 వేల నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

వాహనాల వేలంలో రూ.3,78,780 ఆదాయం

ఆదోని రూరల్: మద్యం కేసులో పట్టుబడిన వాహనాలు వేలం వేయగా ప్రభుత్వానికి రూ.3,78,780 ఆదాయం వచ్చినట్లు సెబ్ సీఐ హరిక్రిష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక సెబ్ స్టేషన్‌లో 28 వాహనాలకు వేలం పాట నిర్వహించారు. 25 వాహనాలను పాటదారులు దక్కించుకున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.2,59,000 కాగా, రూ.3,21,000 జీఎస్టీ రూపంలో మరో రూ.57,780 కలిపి మొత్తం రూ.3,78,780 ఆదాయం వచ్చిందని సీఐ తెలిపారు.